కార్పొరేట్ విద్యావ్యవస్థ దోపిడీని అరికట్టాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యావ్యవస్థ దోపిడీకి పేద, మధ్య తరగతి కుటుంబాలు గురవుతున్నాయని బీసీ కులాల సమన్వయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు లక్ష్మీనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. 2025 – 26 విద్యాసంవత్సరం ప్రారంభం కాక ముందే కొన్ని ప్రైవేటు పాఠశాలలు, కార్పొరేట్ కాలేజీలు అధిక ఫీజులతో తల్లిదండ్రుల గుండెల్లో గుబులు రేపుతున్నాయని పేర్కొన్నారు. విద్యాశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయంపై దృష్టి పెట్టి సరైన చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే సమీక్ష సమావేశం నిర్వహించి ప్రత్యేక జీవోను ప్రవేశపెట్టి ఫీజు నియంత్రణ చట్టం కచ్చితంగా అమలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు చోటు కల్పించాలి

మహిళా కాంగ్రెస్ నేత దేవిరెడ్డి విజితారెడ్డి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ పదవుల్లో, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని మహిళా కాంగ్రెస్ నేత దేవిరెడ్డి విజితారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మదర్స్ డే సందర్భంగా ఆదివారం బర్కత్‌పురలో ఆమె మాట్లాడుతూ... మహిళలకు ఆమె మదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న చైర్మన్, మెంబర్స్ చైర్ పర్సన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ విషయంలో పార్టీ అధినేత సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాయనున్నట్లు తెలిపారు.

సంప్రదాయాలు, విలువలపై అవగాహన



కాచిగూడలోని బ్రహ్మకుమారీస్‌లో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులు

కాచిగూడ: కాచిగూడలోని బ్రహ్మకుమారీస్ సెంటర్‌లో చిన్నారులకు వివిధ అంశాల్లో వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. చిన్నారులకు మన సంస్కృతి, సంప్రదాయాలు, చదువు, విలువలతో కూడిన ఆటపాటలు, వ్యక్తిత్వ వికాసం, సమాజం పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు బ్రహ్మకుమారి సిస్టర్ ప్రశాంతి దీదీ తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 10గంటల నుంచి 11.30గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాతృదేవో భవః



పద్మశాలికాలనీలో మాతృదినోత్సవంలో సొసైటీ ప్రతినిధులు

ముషీరాబాద్: మాతృదినోత్సవాన్ని పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ మహిళా కమిటీ ప్రతినిధులు సుజాత, ఉమాదేవి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సకల జగత్తుకు జీవనాధారం అమ్మ అని అన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిపై ప్రేమ చూపుతూ వారిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు స్వప్న, శ్రీవాణి, లావణ్య, దీప, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

'వందే జనని భారతి'

గన్‌ఫౌండ్రి: తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివారం రవీంద్రభారతిలో సర్వ కళాకారుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో వందే జనని భారతి పేరిట నిర్వహించిన సంగీత, నృత్య నీరాజనం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో ప్రతిభ ఉండి గుర్తింపులేని కళాకారులు ఎందరో ఉన్నారని అలాంటి వారిని వెలుగులోకి తీసుకురావాలని సంకల్పంతో పనిచేయడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు కళాకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

వయోవృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత

మోతీనగర్: వయోవృద్ధులను కంటికి రెప్పలాగా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి. ప్రసాద్ పేర్కొన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ నెలవారి సమావేశంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల జమ్మూ కశ్మీర్‌లో యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేసిన సందర్భంగా సాహిత్య సమావేశాలు, ఉపన్యాసాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ నలమాల్పు అంజిరెడ్డి, సెక్రటరీ ఏవీ సాగర్, కోశాధికారి కొల్లప్ప, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వివేక్‌నగర్‌లో సైనికుల క్షేమాన్ని కాంక్షిస్తూ చేసిన పూజలో బీజేపీ నాయకులు



చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన బీజేపీ నాయకులు



కాచిగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు

సైనికులకు అండగా నిలబడాలి

- కాచిగూడలో సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కమిటీ ర్యాలీ
- భారత సైనికుల కాంక్షిస్తూ ఆలయాల్లో పూజలు

కాచిగూడ: ప్రతీ భారతీయుడు సైనికులకు అండగా నిలవాలని సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఈస్ట్ జోన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.శరత్ శ్యామ్ అన్నారు. సైనికులకు మద్దతుగా ఆదివారం కాచిగూడలో పోలీసులతో కలిసి సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఈస్ట్‌జోన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. భారత్ – పాకిస్తాన్ యుద్ధ ఘర్షణలో వీరమరణం పొందిన భారత సైనికుడు ఎం.మురళీనాయక్, సచిన్‌యాదవ్‌కు, ఉగ్రదాడిలో మరణించిన 26మంది దేశ పౌరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యుద్ధభూమిలో ప్రాణత్యాగం చేసిన వీర జవానులకు ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబాలకు తాను అండగా ఉంటామని స్పష్టం చేశారు. భారత సైన్యం చేపడుతున్న ఆపరేషన్ సిందూర్‌కు పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. భారత్ యుద్ధం ఎప్పుడు కోరుకోదని.. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించే మహాకార్యానికి ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించారన్నారు. కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా దేశ ప్రజలందరూ ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు పలుకుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ పీస్ కమిటీ ప్రతినిధులు శ్రీకిషన్ శర్మ, సయ్యద్ యూనస్ ఫరీదుద్దీన్, మధుసూదన్ సోమాని, వేముల విజయ్ కుమార్, ప్రశాంత్, జలంధర్‌రెడ్డి, బసంతి కౌర్, ఏజాజ్ ఖాద్రి, సయ్యద్ ఖాలీద్ షా తదితరులు పాల్గొన్నారు.



వీరన్నగుట్టలో సైనికుల రక్షణ కోసం చేసిన పూజలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ నాయకులు

భారత సైనికుల రక్షణకు పూజలు

భారత సైనికుల రక్షణకు కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో కాచిగూడలోని వీరన్నగుట్టలో శ్యామ్‌బాబా, ఆంజనేయ స్వామికి బీజేపీ నేతలు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. కుల, మత, భాష, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరూ ఏకమై సైనికులకు మద్దతుగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బల్వీర్, క్షీరసాగర్, హజారి బాబు, అరవింద్, రామ్‌దేవ్, వాసు, బి.బీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సైనికులకు అండగా నిలబడటం మన బాధ్యత: వినయ్‌కుమార్

చిక్కడపల్లి: దేశరక్షణ, సమగ్రత కోసం పాకిస్తాన్‌తో ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తున్న భారత సైనికులకు అండగా నిలబడటం మన అందరి బాధ్యతని సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపుమేరకు ఆదివారం వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి దేవాలయంలో సైనికుల విజయం, క్షేమాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భారత సైన్యం పరాక్రమాన్ని ప్రదర్శిస్తూ శత్రుదేశానికి దీటుగా స్పందిస్తూ పోరాడుతోందన్నారు. ఉగ్రవాదులతో పాటు భారత వ్యతిరేక శక్తులపై సైన్యం ప్రతీకారం తీర్చుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు రత్నా సాయిచంద్, దామోదర్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, సురేష్ రాజు, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైనికులు నిర్వహించిన పోరాటం ఎనలేనిది..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత సైనికులకు మద్దతుగా ఆదివారం చిక్కడపల్లిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బీజేపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైనికులు నిర్వహించిన పోరాటం ఎనలేనిదన్నారు. పాకిస్తాన్ కుట్రలను గ్రహిస్తూ ఎప్పటిప్పుడు తిప్పికొట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్‌రెడ్డి, కేశవ్, కిరణ్, ఎస్.శ్రీనివాస్, ఉపేందర్, వీరయ్య, జ్యోతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి

కాచిగూడ: రాష్ట్రంలోని 20 లక్షల మంది విద్యార్థుల మొత్తం ఫీజుల బకాయిలు రూ.4వేల కోట్లను వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్, ఫార్మసీ, మెడిసిన్, డిగ్రీ, పీజీ కోర్సులు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజు మినహాయింపు స్కీమ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. కోర్సుల అడ్మిషన్ల సమయంలో ఫీజులు వసూలు చేయవద్దని స్పష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం సకాలంలో బడ్జెట్ విడుదల చేయకపోవడంతో 3సంవత్సరాలుగా నాలుగు శాఖలలో రూ.4వేల కోట్ల ఫీజు బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఫీజుల బడ్జెట్ ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టాలని వత్తిడి చేస్తున్నారని అన్నారు. ఫీజు బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. ధర్నాలు, ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించినా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీజుల బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ నిమ్‌కర్, కిషోర్, ప్రదీప్ గౌడ్, మాణిక్‌రావు, తదితరులు పాల్గొన్నారు



కాచిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్ పటేల్

వధూవరులకు ఆశీర్వాదం

అంబర్‌పేట: జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతీదివాకర్ కుమారుడు చైతన్య తేజస్వి వివాహానికి పలువురు ప్రముఖులు హాజరై వధూవరులను ఆశ్వీర్వదించారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్ జరిగిన వివాహానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.



వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

పార్కు అభివృద్ధికి నిధులు కేటాయిస్తా

సుందరయ్య పార్కును సందర్శించిన ఎంపీ అనిల్‌కుమార్



వాకర్స్ క్లబ్ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీ అనిల్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో ఆదివారం రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ సందర్శించారు. అనంతరం వాకర్స్ క్లబ్ ప్రతినిధులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ... పార్కు అభివృద్ధి కోసం తమ ఎంపీ నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా సెటిల్ పోర్టు పునరుద్ధరణతో పాటు చిన్న పిల్లల ఆట పరికరాల పునరుద్ధరణ తగిన నిధులు కేటాయిస్తామని చెప్పారు. వాకర్స్ క్లబ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోశాధికారి శరత్, ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, క్లబ్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షులు వి. నాగభూషణం, ఎస్. మురళీకృష్ణ, ఎస్. రమేష్‌రెడ్డి, శైలజ మోహన్, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్. వివేక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాసాని ఆనంద్, అంజియాదవ్, నవీన్ నాయక్, మీరా బాయ్ తదితరులు పాల్గొన్నారు.

యెగ్గె మల్లేషం ఒంటెద్దు పోకడలను మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోసిక శ్రీనివాసరావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ప్రస్తుత అధ్యక్షులు యెగ్గె మల్లేషం తన ఒంటెద్దు పోకడలను మానుకోవాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోసిక శ్రీనివాసరావు హితవు పలికారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రలో తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ... రాష్ట్ర కురుమ సంఘంలో ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాల్సిన ఎన్నికలను ప్రస్తుత అధ్యక్షుడు యెగ్గె మల్లేషం అంగబలం, ఆర్థికబలం, అధికార బలాన్ని చూపిస్తూ.. నచ్చిన వారికి పదవులు కట్టబెడుతూ ప్రశ్నించిన వారిపై పోలీసు కేసులు పెడుతున్నారని అన్నారు. నియంతృత్వ పోకడలతో కురుమ సంఘానికి అస్తిత్వం లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. సంఘం ఖర్చులపై శ్వేత పత్రం విడుదల చేయడంతో పాటు పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దేవర శ్రీనివాస్ ,గొరిగె మల్లేష్, మాదవరం కృష్ణ, పెంటప్ప, గనం నర్సింహ, దొడ్ల శ్రీనివాస్, ఒనడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్

అఫ్జల్‌గంజ్: భారత సాంకేతిక విద్యామండలి, న్యూఢిల్లీ, ఎస్‌సీసీబీపీల సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (సార్వత్రిక మానవీయ విలువలు) స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ముగిశాయి. వాలెడిక్టరీ సెషన్ సందర్భంగా చైర్మన్ చలమారెడ్డి, సెక్రటరీ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గిరిధర్ ఆకుల, ఐ క్యూ ఏసీ కో ఆర్డినేటర్ గాయత్రీ పావనీ మానవ విలువల ప్రాముఖ్యతను వివరించారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన కార్యక్రమ నిపుణురాలు నిధి చిరాగ్, జేఎన్‌టీయూ అనంతపురం నుంచి వచ్చిన సహ సమన్వయకర్త ప్రసాంతి, పరిశీలకురాలు ఇష్రత్ మీరా మిర్జానా పాల్గొన్నారు.

షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కృషి

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ కృషి చేస్తున్నారని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్, మణికొండ రోడ్డు, జై హింద్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌లోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి ఆయన నిధులు కేటాయించారన్నారు.

పర్యావరణాన్ని కాపాడటమే మన లక్ష్యం

ప్రపంచ పర్యావరణ సంస్థను అభినందించిన పుదుచ్చేరి సీఎం

హిమాయత్‌నగర్: పర్యావరణాన్ని కాపాడటమే మన లక్ష్యమని.. పర్యావరణ జీవజాతి సంరక్షణ కోసం ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న కార్యక్రమాలను పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి అభినందించారని ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్.భద్ర తెలిపారు. ఇటీవల పుదుచ్చేరిలో పర్యావరణం అంశంపై సీఎంను వారి నివాసంలో కలిసి పర్యావరణంపై చర్చించామని తెలిపారు. భవిష్యత్‌లో పుదుచ్చేరి కేంద్రపాలిత రాష్ట్రాన్ని పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైన ప్రదేశంగా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణపై ప్రపంచంలో ఏ సంస్థ చేయలేని విధంగా లక్షలాది మొక్కలు నాటుతూ వేలాది కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

- భూమి మీద జీవజాతిని, వృక్షజాతిని, మానవజాతిని, జంతుజాతిని, జీవవైవిధ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులను చైతన్యపరుస్తూ ప్రపంచ పర్యావరణ సంస్థ చేపట్టిన కార్యక్రమాలు సీఎం అభినందించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా పుదుచ్చేరి ప్రభుత్వం పర్యావరణ సంబంధించిన కార్యక్రమాలను చేపడుతుందని చెప్పారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ రికగ్నైజేషన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ గౌరవ చైర్మన్ తమ్మినేని సత్యనారాయణ, ఫైలింగ్ ఇండియా సంస్థ చైర్మన్ చల్లూరి శ్రీనివాస్, పర్యావరణ సంస్థ పాండిచ్చేరి రాష్ట్ర కో–ఆర్డినేటర్ సురేష్, ప్రధాన కార్యదర్శి నిఖిల్, కోశాధికారి రిజ్వాన్ పాల్గొన్నారు.

షేక్‌పేట్‌లో బాక్సింగ్ శిక్షణ

గోల్కొండ: బల్దియా వారు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలలో జోష్ నెలకొని ఉంది. షేక్‌పేట్‌లో జరుగుతున్న వేసవి బాక్సింగ్ క్యాంప్‌లో టీనేజర్స్ ఎంతో ఉత్సాహంగా బాక్సింగ్ నేర్చుకుంటున్నారు. పంచులు విసురుతు ప్రత్యర్థులను పడగొడుతూ కోచ్ నుంచి కొత్త కొత్త పంచులు ఎలా విసరాలో నేర్చుకుంటున్నారు. ఇక్కడ బాక్సింగ్‌లో శిక్షణ పొందిన వారు గతంలో రాష్ట్రస్థాయి పోటీలలో పతకాలు సాధించారని కోచ్ శివకుమార్ అన్నారు.

సంగర్ జాతి విద్యార్థులకు అభినందనలు



జ్ఞాపికలు అందుకున్న పదో తరగతి విద్యార్థులతో సంగర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ ప్రతినిధులు

నల్లకుంట: సంగర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట నర్సింహబస్తీ కమ్యూనిటీహాల్‌లో పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ గ్రేడ్స్ సాధించిన సంగర్ జాతి కుటుంబాలకు చెందిన పేద విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. సంగర్ జాతి సంఘ్ విద్యా నగర్ కమిటీ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించిన సుమారు 25 మంది సంగర్ జాతి విద్యార్థులకు అవార్డులు, జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. అలాగే చిన్నారులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో తమ వంతు కృషి చేసిన విద్యార్థుల తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ్ విద్యానగర్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్. నర్సింగ్ రావు, కోశాధికారి లక్ష్మణ్ ప్రసాద్, సభ్యులు ప్రభురాజ్, శివశంకర్, అజయ్, కిషన్, శివ, యాదగిరి, నవీన్, చరణ్, మహేందర్, పరమేష్, తేజ, రవి, కిశోర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉజ్వల భవిష్యత్

కాచిగూడ: నైపుణ్యాభివృద్ధి కలిగిన యువతకు ఉపాధి అవకాశాలకు కొదవలేదని.. మెరుగైన వేతనాలు తీసుకుంటూ స్వేచ్ఛగా పనిచేసే వీలుంటుందని బ్రహ్మకుమారీస్ సిస్టర్ అంజలి అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని హైందవి కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం హైందవి విద్యా సంస్థల చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను వినియోగించుకొని మంచి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో అద్భుతమైన శక్తి దాగి ఉంటుందని, దానికి పదును పెడితే.. రాకెట్ వేగంతో దూసుకుపోతారని అన్నారు. సిగ్గు, బిడియం, కలవరం, మానసిక ఆందోళనలతో విద్యార్థులు ఏమీ సాధించలేరని, తమలో శక్తిని సరైన క్రమంలో వినియోగించుకుంటే విజయం వరిస్తుందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తే విద్యార్థులందరూ మెరికలేనని ఆమె పేర్కొన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీస్ సిస్టర్ ప్రమీల చేతుల మీదుగా కేక్ కట్ చేయించి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సిస్టర్ ప్రశాంతి, దేవిరెడ్డి విజితారెడ్డి, రఘుపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న బ్రహ్మకుమారీస్ సిస్టర్ అంజలీ

నిబంధనలకు విరుద్ధంగా డ్రైవింగ్‌లో శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నిబంధనలకు విరుద్ధంగా క్యాంపస్‌లో కొందరు బయటి వ్యక్తులు కార్ డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదు. క్యాంపస్‌లో నిబంధనలకు విరుద్ధంగా బయటి వ్యక్తులు కారుతో పాటు ఇతర వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ, పెంపుడు కుక్కలతో తిరగడం, ఆవులు, గేదలు మొక్కలను పాడుచేయడం, వీడియో షుటింగులతో రీల్స్ చేయడం, జంతువులను బలి ఇవ్వడం తదితర కార్యక్రమాలు సెక్యూరిటీ సిబ్బంది ఎదుటే చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బయటి వ్యక్తులు సెక్యూరిటీ సిబ్బంది ముందే కారు డ్రైవింగ్ చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఏటా కోటి రూపాయాలు తీసుకుంటున్న ప్రైవేటు సెక్యూరిటీ యాజమాన్యం వర్సిటీ భద్రతను పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జోన్నాడ శ్రీకాంత్ సేవలు చిరస్మరణీయం

కాచిగూడ: మున్నూరుకాపుల సంక్షేమం, అభివృద్ధి కోసం జోన్నాడ శ్రీకాంత్ అందించిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శి మంగళారపు లక్ష్మణ్ అన్నారు. కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో ఆదివారం జోన్నాడ శ్రీకాంత్ సంతాపసభను నిర్వహించారు. మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జోన్నాడ శ్రీకాంత్ పనిచేశారని, ఆయనతో తమకున్న అనుబంధాన్ని వారు గుర్తు చేసుకున్నారు. ఆయన చిత్రపటం వద్ద పలువురు నేతలు పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను కొనియాడుతూ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మణికొండ రమేష్‌కుమార్, కొండూరు వినోద్ కుమార్, కట్టెల సుభాష్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాంత్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్నూరుకాపు మహాసభ ప్రతినిధులు